భర్తని కోల్పోయిన
ఆమెని ఆశించిన
అతడు ఎదురుచూడని
సంఘటన?

# ప్రేమకి నిర్వచనం




బుక్ ఫెయిర్‌కి వెళ్లి కార్ పార్క్ చేసి బయటికి వస్తుంటే కనిపించిందామె.

"నీరూ" అన్నాడతను సంభ్రమంగా. రేక్‌లో బేగ్ వుంచి బిళ్ల తీసుకుంటున్న నీరజ వులిక్కిపడింది. "ఎన్నాళ్లయిందా స్వరం విని!" చిరునవ్వుతో అతనికెదురెళ్లింది "బావున్నావా ఉదయ్?"

అతను తలపంకించేడు. ఎన్నెన్నో మాట్లాడాలనుంది. మరెన్నో అడగాలనుంది ఉదయ్ .. కాని ఎక్కడ మొదలుపెట్టాలి? ప్రారంభం తెలీని వర్తమానపు అయోమయపు స్థితి. విషాదపు ముగింపునిచ్చేసి చెలిమికి స్వస్తిచెప్పిన గతంలోని అపరాధభావం తోడై కంఠాన్ని నలిమేస్తూ స్వరాన్ని మింగేసింది. అందుకే అతను నోరు విప్పలేదు. ఎప్పటిలాగే ఆమె దారి చూపించింది.

"పద... లోపలికి వెడదాం". స్టాల్స్ తిరుగుతున్నంతసేపు ఆమె ఏమీ మాట్లాడలేదు. అతనూ అంతే. రెండుమూడుచోట్ల పుస్తకాలు కొనుక్కొని ఆమె డబ్బులు కట్టేస్తుంటే అతనివ్వబోయేడు. చిరునవ్వుతోనే వారించింది. బలవంతం చేయబోతే "లంచమా?" అంది సూటిగా చూస్తూ. అంతే అతని చొరవ అనే అధ్యాయానికి అది ముక్తాయింపైంది.

ఉదయ్ మనస్సేమీ బాగుండలేదు. పొద్దున్నే భార్య ఫోన్‌చేసి మరోసారి అతని నిర్ణయం తెలుపమంది. స్టేట్స్‌లో కూతురి దగ్గరే వుండిపోయేందుకు ఆమె నిశ్చయించుకుంది. అతనికా విషయం మింగుడుపడడం లేదు. అతని వ్యాపారం అంతా ఇక్కడే వుంది. నిజానికది మావగారి దగ్గర్నుండే



ఉదయ్‌కి సంక్రమించింది. కష్టపడి, రక్తం ధారపోసి దాన్ని మరింత అభివృద్ధి చేశాడు. నీరజని చేసుకోవడానికి కారణం అదేకదా!

''ఏయ్'' చమవుగా అతని భుజంమీద చరిచింది నీరజ. ''పగటి కలలు కనే అలవాటు ఇంకా పోలేదా? అంటూ... అంతలోనేనవ్వేసింది. ''కలలన్నీ నిజంచేసే సుకున్నావ్ ఇంక పగటికలలుకనే ప్రసక్తేముం

దిలే''

ఆమె వ్యంగ్యంగా అన్నదేమో అని తేరిపార చూశాడు ఉదయ్. ఊహూ... ఎప్పటిలాగే స్వచ్ఛత తప్ప మరే భావం లేదు ఆమె మొహంలో. మౌనంగా ఆమెని అనుస రించాడతను. గతం కాగితం పడవై జ్ఞాపకాల ప్రవాహంలో రాయంచలా సాగుతూంది. అది రేపుతున్న నిర్మల తరంగాలు ఇప్పుడు శరీరంలో కొత్త అలజడులు సృష్టిస్తూ ఉదయ్ ని ఇబ్బంది పెడుతున్నాయి. ఆమెదగ్గ ర సెలవు తీసుకోమని వివేకం హెచ్చరిస్తుం టే మనస్సు శరీరం రెండూ ఏకమైన ఆమె సామీప్యాన్ని కోరుతూ సంభాషణ పొడిగించ మంటున్నాయి.

''శృతి ఎలా వుంది?'' భార్య పేరువిని ఉలిక్కిపడ్డాడు. ఎంత బాగా జ్ఞాపకం పెట్టుకుంది... తనేమో ఆమె విషయాలేమీ అడగలేదు.

''బాగుంది. ప్రస్తుతం మాన్‌చెస్టర్‌లో వుంది''

''రమ అక్కడే వుందనుకుంటాను''

''ఆ... వాళ్లదగ్గరే వుంటూంది. మా అల్లుడికి కంప్యూటర్స్ తయారుచేసే యూ నిట్ వుంది.''

''మరి నువ్వు వెళ్లలేదూ'' ప్రశ్నార్థకం గా చూసి అంతలోనే ''నువ్వు ఆ వాతావర ణంలో ఇమడలేవులే'' అనేసింది నీరజ.

''నీకెలా తెలుసు'' నాలుక కొసవరకూ వచ్చిన ప్రశ్న అందులోని అసంబద్ధత తెలిసినట్లు పెదవి దాటలేదు. ఆమెకంటే తనని బాగా చదివినవాళ్లెవరున్నారు కనుక? రెప్పలార్పకుండా చూస్తున్నాడామెని. గడిచిన కాలం, సంపాదించిన డబ్బు తనకి హుందాత వం తెచ్చాయి.విందుదవాన్ని ఇచ్చేయి. చెంప లని నెరిపి కళ్లకింద నల్లవారల ముగ్గులు గీశాయి. గెడ్డం కింద బంతిలా మరో గెడ్డాన్ని అమర్చాయి. అందం విషయంలో తనపట్ల పక్షపాతం చూపించింది సమయం... వయ స్సుకి మరో పదేళ్లు కలిపేసింది కాలం. ఆమె విషయంలో అలా కాదు. ఆమె అందం ద్విగుణీకృతం అయింది. అతనికామె వీడ్కో లు బహుమతి గుర్తువచ్చింది.

''మా ఇంటికి రారాదూ'' అన్నాడు అడుగు బయటపెడ్తూ.

☆ ★ ☆

నల్లటి రహదారిమీద చుక్కలా మెరిసిపో తూ పాదరసంలా జారిపోతూ సాగిపోతోంది కారు. ఆమె ఫ్రంట్ సీట్లో అతని ప్రక్కనే కూర్చుని వెనక్కి వాలి కళ్లు మూసుకుంది. చందమామ కేరింతలు కొడుతూ వెన్నెలని పంచేస్తూంటే పుడమి ఆప్యాయంగా పంటిని అద్దేసుకుందా వెండి జల్లుని. కిటికీలోంచి రివ్వున వీస్తున్న చలిగాలి అతని కాంక్షని రెట్టింపు చేస్తూంది.

''ఛ... మరీ ఇంత బలహీనమైపోయానే మిటి?'' అతను డ్రైవింగ్‌మీద ఏకాగ్రత నిలిపేడు... క్షణంసేపే... మళ్లీ మామూలే. .. దారిలో చెప్పిందామె. రెండు నెలల క్రితం వచ్చిందీ వూరు – ట్రాన్స్‌ఫర్ అవడంతో ఒకే కొడుకు... బోర్డింగ్ స్కూ ల్లో చదువుతున్నాడు.

''మీవారేం చేస్తుంటారు'' క్షణం నిశ్శబ్ద ం... ఆ తరువాత గాలి మోసుకొచ్చింది వేదనా తరంగాలు.

''ఏక్సిడెంట్‌లో చనిపోయి రెండేళ్లయిం ది. ఆయన ఉద్యోగమే నాకిచ్చేరు'' ఎక్కడో

గుండెల్లో నిదరోతున్న అనురాగం క్షణం కళ్లు విప్పింది.

''ఐయామ్ సారీ'' అన్నాడు ఉదయ్ బాధపడుతూ... ఆమె మౌనంగా వుండిపోయింది.

ఎన్నో స్మృతులు. ఏవో జ్ఞాపకాలు... తిరిగి కలవడం అసాధ్యం అనుకున్న తామిద్దరినీ విచిత్రంగా కలిపింది కాలం.

☆ ★ ☆

ఉదయ్ నీరజావాళ్లింట్లో అద్దెకుండేవాడు. సిఏ ఫైనల్ పరీక్ష కోచింగ్‌కి వచ్చేదు మద్రాసు అతను. ఎకౌంట్స్‌లో సందేహాలు తీర్చుకునేందుకు వచ్చే నీరజ అతని మనస్సుని కల్లోలపరిచింది. ఆమెకి పాఠాలు చెబుతూ ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోయేవాడతను. ఆర్నెల్లలో పరిచయం స్నేహం గడపదాటి ప్రేమ ప్రాంగణంలో అడుగుపెట్టింది. ఐనా ఆమె అతని చనువుని సరిహద్దు దాటనివ్వలేదు.

''వద్దు... ప్లీజ్'' అతని కౌగిలినుండి మృధువుగా విడిపించుకునేది.


''నామీద నమ్మకంలేదూ?'' దెబ్బతిన్నట్లు చూసేవాడు.

''వుంది... కానీ మన వయస్సుమీద లేదు'' నవ్వేసేది. ఎన్నెన్ని కృష్ణలూ, ఇంకెన్ని గోదావరులూ ప్రవాహమై అతన్ని వలపు నీళ్లలో నిలువునా తడిపేసేవి. ఆరోజు మామూలుగా వచ్చిందతని గదికి ఐదునిమిషాల నిశ్శబ్దం తరువాత సూటిగా అడిగింది.

''మనం పెళ్లెప్పుడు చేసుకుందాం?''

''పెళ్లా?'' ఉలిక్కిపడ్డాడు ఉదయ్. ఇసుకలో చేపపిల్లైంది నీరజ హృదయం. మొహంలోని రక్తం ఇంకిపోయి, కళ్లలోకి చేరుకుంది. పైకి శాంతంగా అంది ''పెళ్లివద్దులే... ఎప్పటికీ ఇలాగే ప్రేమించుకుంటూ వుండిపోదాం''.

ఉదయ్ బాధగా చూశాడు. ''నా ఉద్దేశ్యం అదికాదు. ప్రస్తుతం మనిద్దరికీ ఉద్యోగం లేదు. భవిష్యత్తు ఆలోచించకుండా



ఇప్పుడు తప్పటడుగు వేసేసి తరువాత విచారించి ప్రయోజనం ఏముంటుంది చెప్పు''

''నిజమే'' శుష్కహాసం చేసింది. ''ముద్దులకీ, కౌగిళ్లకీ, ప్రేమకీ, వర్తమానంతో తప్ప భవిష్యత్తుతో పనిలేదు. ఎటొచ్చీ పిచ్చిది పెళ్లే. దానికే కులగోత్రాలు, ఆస్తులు, అంతస్థులు, కేరెక్టర్ అన్నీ కావాలి''

''నన్ను అపార్థం చేసుకుంటున్నావ్''

''లేదు ఉదయ్... నన్ను నేను అర్థం చేసుకునే ప్రయత్నంలో వున్నాను''

మరో పదిహేనురోజులకి తీసుకువచ్చిందా వార్త.

''వచ్చే నెలలో నా పెళ్లి'' అతను నిరాసక్తతతో విన్నాడు. హృదయం తేలికై నిశ్వాస రెక్కలు కట్టుకుని బయటపడిపోయింది. ఆమె అది గమనించలేదు. చెక్కిలిమీద మృధువుగా ముద్దుసంతకం చేసింది. అతని నిగ్రహం సడలలేదు. చవిని సుతారంగా కొరికి వదిలేసింది.ఆమె నడుముని అల్లుకోబోయిన చేయి సగంలోనే ఆగిపోయింది. అది గ్రహించినట్లు నవ్వింది నీరజ్. ''భయపడకు నేస్తం. విన్నేం ట్రాప్ చేయడంలేదులే... నా పెళ్లికి నిశ్చితార్థం జరిగిపోయింది''

మనస్సులో బెంగ తీరగానే సుడిగాలిలా అల్లుకుపోయాడు ఉదయ్ ఆమెని... అతను ప్రశ్న ఆమె ప్రత్యుత్తరం... అతను చీకటి ఆమె వేకువ... అతను మబ్బు ఆమె మెరుపు. చాలా సేపటికీ... అతను ప్రేమ పరాకాష్టతో అనురాగ శిఖరాన్నిచవిచూస్తున్నప్పుడు నీరజ అతని చెవిలో ఆప్యాయంగా గుసగులాడింది.

''పిరికిపంద'' — ఆ పదం జీవితాంతం అతన్ని వెన్నాడుతూనే వుంది. అమిత సంతోషంగా వున్నప్పుడూ, అతి దుఃఖభారంతో వున్నప్పుడూ ప్రత్యేకించి వెన్నెలరాత్రుల్లోనూ సమాగపు పొద్దుల్లోనూ...

అది గుర్తు వస్తూనే వుంది.

☆ ★ ☆

మెట్లెక్కి అతని గదిలోకి అడుగుపెట్టి క్షణం ఊపిరి తీయడం మరిచింది నీరజ. ''ఫెంటాస్టిక్'' ఆమె అణువణువూ తన ఇంటీరియర్ డిజైనింగ్ నైపుణ్యమంతా చూపించింది అతని అర్ధాంగి... శృతి నైపుణ్యానికి డబ్బు తోడై ఆ గదికి మరింత వన్నెతెచ్చింది.

ఆమె ప్రశంసని పట్టించుకోలేదు ఉదయ్.

''ఆ రోజులే బావున్నాయ్ నీరూ'' అన్నాడు నిట్టూర్పు విడుస్తూ. చురుగ్గా చూసింది నీరజ. ''అదేం?''. అతను వివరించబోతుంటే తనే వారించింది.

''వద్దులే ఉదయ్. గతాన్ని తవ్వుకోవడం నిష్ప్రయోజనం అది తెలిసీ వివేకం పోగొట్టుకోవద్దు మనం... వర్తమానం అందమైంది. భవితవ్యం అద్భుతం... ఇదే నిజం''

అతను మాట్లాడకుండా లేచి నిలబడి అంతలోనే ఏదో నిశ్చయానికి వచ్చి ఆమె పక్కనే కూర్చున్నాడు. రేడియోగ్రామ్‌నుండి వినపడ్తున్న సంగీతం... దానికితోడు ఏకాంతం అతనిలో కోర్కెలకి ఆజ్యం పోస్తుంటే ఆమెవేపు ఆరాధనగా, కాంక్షగా చూస్తూండిపోయాడు. అదేమీ గమనించని నీరజ గదంతా కలియజూస్తూండిపోయింది... ఎక్కడా అతని భార్య ఫోటోకానీ, పిల్లల

ఛాయాచిత్రాలుకానీ లేవు. అప్రయత్నంగా హాండ్‌బాగ్ తడుముకుంది... తన వెంటే వుంటుందది ఎప్పుడూ.

అతనామెకి మరింత చేరువవుతూ "ఆ రాత్రి గుర్తుందా" అన్నాడు చొరవగా పొందిగా. ఉండేలు దెబ్బతిన్న పక్షయింది నీరజ. కేవలం నిమిషమే... తిరిగి మామూలైపోయింది.

"లేకేం" అంది నిర్లిప్తంగా.

"నేనూ మరచిపోలేదు" సుడిగాలిలా ఆమెను చుట్టేసి ముద్దుల వర్షం కురిపించాడు. కళ్లపైన, కనుబొమ్మలపైన, నాసికమీద, పెదవులపైన. ఆమె నిరుత్తరైంది. క్షణంపాటు కోర్కెల ప్రవాహంలో కొట్టుకుపోయి ఆపైన నిలదొక్కుకుంది.

"వద్దు ప్లీజ్" అంది ఆమె దూరంగా జరుగుతూ. అతనిది కవ్వింపు చర్య అనుకుని. మరింత చెలరేగేడు. అరనిమిషం నిస్సహాయంగా వుండిపోయింది నీరజ. మరి ఆగలేక వూపిరి గట్టిగా పీల్చి శరీరంలోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుని లాగి చెంపకాయ కొట్టింది. దిమ్మెరపోయి బిత్తరపోయి ప్రశ్నార్థకంగా చూసేడు ఉదయ్ ఆమెవేపు.

"అదేమిటి?"

ఆనాడుకన్నెనైనా, మరొకరితో మనువు నిశ్చయమైనా నేను బెట్టుచేసినా సర్వం అర్పించేవ్... ఈనాడు ఏ అడ్డూ లేదు నీకు, నాకు. నేనుగా నిన్ను కోరుకుంటున్నాను. మరి? మరి? ఎన్నెన్నో అడగని ప్రశ్నలు అతని కళ్లలో...

ఆమె పెదిమలు బిగబట్టి నిల్చుండిపోయింది. రెండేళ్లు నువ్వు చూపించిన ప్రేమకి ఫలితమది ఆనాడు. అప్పట్లో నా భర్త తెలియదు నాకు. అంతేకాదు. ఆ అనుభవం ద్వారా నీలో జీవితాంతం నిక్షిప్తమైపోయి నిన్ను కొంచెంగా నేను మిగుల్చుకోవాలన్న స్వార్థం వుండింది నాలో అప్పుడు. కానీ ఇప్పుడు నాగురించి సర్వం తెలిసీ ఆదరించి, ఆప్యాయం, అనురాగం, ప్రేమ చూపించిన ఒక మగవాడికి భార్యని నేను... అతను లేకపోతేనేం... అతనికి నైవేద్యమైన ఈ శరీరం మరెవరి ఎంగిలి భరించలేదు. ఎలా చెప్పాలి నేస్తం నీకిది? కుడిచేయి చాపి సోఫాలోని హేండ్‌బాగ్ అందుకుంది నీరజ. తెరచుకున్న బ్యాగ్‌లోంచి ఆమె ఫామిలీ ఫోటో చూపుడువేలికి తగిలింది.

"అది నీకర్థంకాదులే" అతని ప్రశ్నలకి సమాధానంగా అందామె బయల్దేరేందుకుసిద్ధమవుతూ.

ఆమె ప్రత్యుత్తరంలో ప్రేమకు నిర్వచనం నిక్షిప్తమై వుంది.

☆ ★ ☆

